# వారేం అంటారో!

అసలు కల్యాణి చిన్నప్పటినుంచీ స్వతంత్ర భావాలుగల మనిషి ఏం మాట్లాడినా కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడుతుంది మనసులో ఏమీ వుంచుకోదు. తనకి నచ్చని ఏ విషయంతోనూ రాజీపడే గుణం ఆమెకు లేదు నిక్కచ్చి మనిషి తన వ్యక్తిత్వాన్నెవరయినా కించపర్చడానికి ప్రయత్నిస్తే వాళ్ళకి తగినరీతిగా బుద్ధి చెప్పేవరకూ నిద్రపోదు.

స్కూల్లోనూ, కాలేజీలోనూ కూడా వక్తృత్వపు పోటీల్లో పాల్గొని బహుమతులందుకునేది పాఠాలు చెప్పని లెక్చరర్లని "పట్టుకుని దులిపేసే" డాషింగ్ నేచర్ ఆమెది ఓ పోకిరీ పిల గాడిని నడిబజార్లో నిలబెట్టి "నీకు అమ్మ లేదూ? అక్కా చెల్లెళ్ళు లేరూ?" అని కడిగేసిన ఘనత ఆమెదే.

కొంచెం ఎదిగాక, నవల్లూ అవీ చదవటం ప్రారంభించేక-స్త్రీల సమస్యలూ అవీ వంట పట్టించుకున్నాక ఆమె భావాలలో తీవ్రత మరింత హెచ్చయింది పురుషాధిక్యతని సహించలేకపోయింది. అనాదిగా ఆడవారికి జరుగుతున్న అన్యాయాలకి కుతకుతలాడి పోయింది తను మాత్రం అందరి ఆడవాళ్ళలాగా పరిస్థితులతో రాజీపడిపోయి, భర్త అడుగులకు మడుగులొత్తుతూ వుండకూడదనుకుంది. తన స్వతంత్ర భావాలని కాపాడుకోవాలని గట్టిగా నిశ్చయించుకుంది.

కానీ, దురదృష్టవశాత్తు పెళ్ళయి ఏడాదికాకుండానే కల్యాణికీ ఆమె భర్తకీ మధ్య కలతలు మొదలయ్యాయి. తన వ్యక్తిత్వాన్ని ఆయన గుర్తించటం లేదనీ - తనలోని అభ్యుదయభావాలకీ. స్వేచ్ఛా ప్రవృత్తికీ అతను దోహదం చేయటంలేదనీ ఆమెకి కోపం వచ్చింది. తను స్వయంగా తీసికొనే నిర్ణయాలను ఆయన మెచ్చుకోవటంలేదని ఆమెకు రోషం వచ్చింది.

అలిగి పుట్టింటికి వచ్చేసింది రెండో పిల్ల పెళ్ళికి దాదాపు అన్ని ఏర్పాట్లూ చేసుకున్న ఆమె తల్లి దండ్రులు "పోనీ అమ్మాయి కాస్త ముందుగా వచ్చింది" అనుకున్నారు నాల్రోజులు పోతే ఆ భార్యా భర్తల తగాదా సర్దుబాటవుతుందిలే అనుకున్నారు అల్లుడికి నచ్చచెబుతూ కల్యాణి తండ్రి ఉత్తరం రాసారు. స్వయంగా వెళ్దామంటే పెళ్ళియత్నాలతో తీరికలేకపోతోంది.

ఈలోగా కల్యాణి తండ్రికి అర్జంటుగా కొంత డబ్బు అవసరమయింది. రావాల్సిన డబ్బు సమయానికి చేతికి అందకపోవటంతో గాభరా పడ్డారాయన.

బాగా ఆలోచించి, చివరకి కల్యాణితో అన్నారు "అమ్మాయ్ ఇదీ సంగతి డబ్బు చేతికందలేదు-పెళ్ళి దగ్గర పడిపోతోంది-మీ అమ్మ గొలుసు, నీ గాజులూ బేంక్‌లో పెట్టి లోన్ తెద్దామనుకుంటు కుంటున్నాను మీ చెల్లి పెళ్ళికాగానే అనుకున్న డబ్బు చేతికందుతుంది-లోన్ తీర్చేద్దాం-ఏమంటావమ్మా?"

కల్యాణి యిరకాటంలో పడింది

"వారేం అంటారో నాన్నా!" అంది సణుగుతూ

—పంతుల జోగారావు